క్లుప్తంగా

ఆలయ హుండీ లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న అధికారులు, పాలక మండలి సభ్యులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం ఆలయ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఆలయ చైర్మన్ బీపీ విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ ఈఓ సురేష్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో లెక్కించారు. రెండు నెలలకు హుండీ ఆదాయం రూ. 1,72,084లు వచ్చిందన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కమలాపురం : కమలాపురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న అలీఖాన్ చెన్నూరుకు బదిలీపై వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న సరస్వతి కమలాపురం మండల తహసీల్దార్‌గా బదిలీ అయినట్లు సమాచారం. కమలాపురం నుంచి బదిలీపై వెళ్తున్న అలీఖాన్‌ను కార్యాలయ సిబ్బంది మంగళవారం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.

నేడు దుగ్గాయపల్లెలో జగనన్న సురక్ష కార్యక్రమం

వల్లూరు : మండల పరిధిలోని దుగ్గాయపల్లె గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రజలకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందచేయడం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామంలో బుధవారం ఉదయం 10 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో 11 రకాల ధృవీకరణ పత్రాలను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేముల : మండలంలోని 33 కేవీ వేముల ఫీడర్ మరమ్మతుల కోసం బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జేఈ రమేష్ తెలిపారు. దీంతో వేముల, రాచకుంటపల్లె, మబ్బుచింతలపల్లె, పెద్దజూటూరు, భూమయ్యగారిపల్లె, వేల్పుల సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నామని వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఎర్రగుంట్ల : పట్టణంలోని మహాత్మనగర్ కాలనీలో నివాసం ఉండే వైఎస్సార్‌సీపీ నాయకుడు రామలింగారెడి తండ్రి నాగిరెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి ఆయన ఇంటి వద్దకు వెళ్లి సంతాపం తెలియజేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ కొరకు నిరుద్యోగ యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఆ పై కోర్సులు చదివిన విద్యార్థులు తమ వివరాలను కళాశాలలోని రిజిష్టర్ నందు నమోదు చేసుకోవాలన్నారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సాంబశివుడు 9966452542, సౌజన్య 8919860680 నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడండి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు సుజాత

కొండాపురం : రాబోయే వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని కొండాపురం వైద్యురాలు సుజాత కోరారు. మంగళవారం కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. వర్షాకాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో లబ్ధిదారుల్లో ఆనందం



జమ్మలమడుగులో లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : జగనన్న సురక్షతో లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మోరగుడి గ్రామ సచివాలయం–2లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి మాట్లాడారు. పాదయాత్రలో జగనన్న ఇచ్చిన హామీ మేరకు పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు వారి ఖాతాల్లో నగదును వేయడం జరిగిందన్నారు. అధికారులు అర్హులను గుర్తించి పథకాలు అందించాలని ఆయన సూచించారు. అనంతరం లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుద్దేటి హరిత, తహసీల్దార్ గురప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల టౌన్ : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సియోన్‌పురం వార్డు సచివాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 412 సర్టిఫికెట్లను ఉచితంగా ప్రజలకు అందించారు. సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు పార్నపల్లె కిశోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కడియాల లక్ష్మీనారాయణ, మెప్మా అధికారి గంగులయ్య, ఆర్‌ఐ సుజిత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో వలంటీర్ల వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. మంగళవారం మండలంలోని కామసముద్రం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఆయన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. కామసముద్రం సచివాలయ పరిధిలో 11 రకాల సమస్యలను గుర్తించడంతో ఆయా గ్రామాల్లో 98 అర్జీలు అందాయన్నారు. వాటిలో 94 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామసముద్రం, దొండ్లవాగు సర్పంచ్‌లు అనురాధ, భవాని, ఎంపీటీసీ లక్ష్మిదేవి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీటీ త్రిభువన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బాబురెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్లా రమేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.



పులివెందులలో ప్రజలకు సర్టిఫికెట్‌లను అందిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి



ఎర్రగుంట్లలో లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్‌రెడ్డి

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక 1వ సచివాలయంలో వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీటీసీ కటిక చంద్రశేఖర్ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటేష్, బికారి, బాలయ్య, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజా సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమనుగుత్తి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ, తహసీల్దార్ ఎ.నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ ఎన్.సుబ్బమ్మ, ఎంపీటీసీ సుజనదేవి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : మండలంలోని ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ మాట్లాడారు. ప్రజలు ఎన్నో ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వారి సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతుంటే ఈ నేపథ్యంలో జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ఎర్రసాని మోహన్‌రెడ్డి, బయనపల్లి సర్పంచ్ తుంగా చంద్రశేఖర్‌యాదవ్, వ్యవసాయ సలహామండలి సభ్యులు నీలం వెంకట సుబ్బారెడ్డి, చెన్నూరు టౌన్ కో కన్వీనర్ సింగంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛ పులివెందులకు సహకరించాలి

పులివెందుల టౌన్ : మహిళలు వ్యర్థ పదార్థాలు మ్యాన్‌హోల్స్‌లో వేయకుండా ఇంటింటి చెత్త సేకరణ వాహనాలకు అందించి స్వచ్ఛ పులివెందులకు తమవంతు సహకారం అందించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని మైత్రి లేఅవుట్, భాకరాపురం ప్రాంతాలలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డుపై ఫిర్యాదులు రాగానే సదరు ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. భాకరాపురంలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ శుభ్రం చేయు పనులను పరిశీలించారు. చెత్త సేకరణ వాహనాలు రాని ప్రాంతాల వారు తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



యూజీడీ పనులను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

సమస్యలు గుర్తించడంలో కీలక పాత్ర పోషించాలి

వీరపునాయునిపల్లె : ప్రజల సమస్యలు గుర్తించడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషించాలని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్, జేసీఎస్ కన్వీనర్ వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉరుటూరు, యు.వెంకటాపురం సచివాలయాల్లో ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వలంటీర్లు ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసే 11 రకాల ధృవీకరణ పత్రాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల అధక్షుడు రఘునాథరెడ్డి, ఉరుటూరు ఎంపీటీసీ లక్ష్మిరామాంజనమ్మ, వెంకటాపురం సర్పంచు పుల్లయ్య యాదవ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలోనే కాన్పు అయ్యేలా చూడాలి

వేంపల్లె : ప్రతి గర్భవతి ప్రభుత్వాసుపత్రిలోనే కాన్పు అయ్యేలా చూడాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో ఆయన సమావేశం నిర్వహించి తగిన సలహాలు, సూచనలు చేశారు. 12 వారాల్లో గర్భవతి నమోదు చేసి ప్రతి గర్భవతికి ఎస్‌సీపీ కార్డు ఇవ్వాలని తెలిపారు. అలాగే వ్యాధి నిరోధక టీకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మునిరెడ్డి, డాక్టర్ స్వాతిసాయి, డాక్టర్ పృధ్వీకుమార్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా బేగం, సీహెచ్‌ఓ వెంకటరత్నం, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వర కుమార్

తొలివిడత గ్రామాల నిర్వాసితులు ఆధారాలు ఇవ్వండి

కొండాపురం : గండికోట జలాశయం కింద ముంపునకు గురైన తొలివిడత గ్రామాల నిర్వాసితులు 2004–2007 కటాఫ్ డేట్ ఆధారంగా రేషన్ కార్డు, ఓటర్ కార్డు, చదువుకున్న సిర్టిఫికెట్లు, స్థానిక ఆధారాలు ఇవ్వాలని మండల తహసీల్దార్ శోభన్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలివిడత గ్రామాలైన దత్తాపురం, పక్కీరపేట, బొమ్మేపల్లె, బుక్కపట్నం, దొరువుపల్లె గ్రామాల నిర్వాసితులు కె.సుగుమంచిపల్లె గ్రామ సచివాలయంలో వీఆర్వోలు రాజు, పెద్దన్న, సుబ్బరాయుడులకు ఆధారాలు ఇవ్వాలన్నారు. అలాగే గంగాపురం, రేపల్లె, చౌటిపల్లె గ్రామాల నిర్వాసితులు వీఆర్ఏ రామంజినేయులు మరో ఇద్దరి అధికారులకు ఆధారాలు ఇవ్వాలన్నారు. సీతాపురం, ఓబన్నపేట, గండ్లూరు గ్రామాల నిర్వాసితులు ఓబన్నపేట గ్రామ సచివాలయంలో వీఆర్వో నారాయణకు ఆధారాలు ఇవ్వాలన్నారు. ముచ్చుమర్రి, నేదరపేట గ్రామాలకు వీఆర్వో నిఖితను నియమించినట్లు తెలిపారు.

దేవస్థానానికి పరిహారం చెల్లించండి

వేంపల్లె : స్థానికంగా రహదారుల అభివృద్ధిలో భాగంగా స్థలం కోల్పోయిన వృషభాచలేశ్వరస్వామి దేవస్థానానికి నష్టపరిహారం చెల్లించకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం ఆయన స్థానిక బీజేపీ నేతలతో కలిసి తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏడాది దేవస్థానం వారు గ్రామ పంచాయతీ ద్వారా ప్రభుత్వానికి రూ.12 లక్షలు చెల్లిస్తున్నారని.. మరీ మసీదు కమిటీ వారు కేవలం రూ.3 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారని.. అయితే నష్టపరిహారం విషయంలో మసీదు కమిటీకి రూ.3.70 కోట్లు, దేవస్థానానికి రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దేవస్థానం వారు స్థలం కోల్పోయి 8 నెలలు గడుస్తున్నా పట్టించుకోలేదన్నారు. అత్యధిక మెజార్టీ ఉన్న హిందువుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం హిందువుల ఆలయాలపై, ఆస్తులపై ఎందుకింత నిర్లక్ష్యమన్నారు. మసీదు కమిటీ వారు తమ ఖాతాలో నష్టపరిహారం నిధులు వచ్చాకే వారి గదులు తొలగించారని.. వీటన్నింటిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని దేవస్థానానికి రావాల్సిన నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

22 నుంచి పీడీఎస్‌యూ శిక్షణ తరగతులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలో ఈ నెల 22,23 తేదీలలో నిర్వహించే ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు కోరారు. మంగళవారం కడపలోని ప్రగతి హాస్పిటల్ భవనలో పీడీఎస్‌యూ తరగతుల కరపత్రాలను పీడీఎస్‌యూ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతులలో విద్యారంగ సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాలలో మంగళవారం విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్ర పటానికి కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్.భేగ్, అధ్యాపకులు, విద్యార్థులు పుష్పాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్.భేగ్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో స్టూడెంట్ ఆక్టివిటీ అధికారి డాక్టర్ రాజేష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల డీన్ ఎం.ఎస్.భేగ్

బీఎడ్, డీఎడ్ కోర్సులు ప్రారంభించాలి

కడప ఎడ్యుకేషన్ : మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి చెందిన పాలిటెక్నిక్ కళాశాల(మను)లో డీఎడ్, బీఈడీ కోర్సులను ఉర్దూ మీడియంలో ప్రారంభించాలని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్(ఐటా) రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్‌రజాక్, కోశాధికారి ఫయాజుల్ కోరారు. ఈ విషయమై మంగళవారం కడప మను పాలిటెక్నిక్ కళాశాలకు విచ్చేసిన వైస్ చాన్సులర్ సయ్యద్ ఐనుల్ హసన్, విశ్రాంతి వీసీ రహమతుల్లా, డీన్ అబ్దుల్‌వాజిద్‌లను వారు కలిసి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప మనులో విద్యార్థులకు హాస్టల్ వసతి లేని కారణంగా రాష్ట్ర నలుమూలల నుంచి అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు వెనుకంజ వేస్తున్నారన్నారు. రాయలసీమ జిల్లాలతోపాటు గుంటూరు, ప్రకాశం జిల్లాలో ఉర్దూ మీడియం విద్యార్థులు ఎక్కువగా ఉన్నారన్నారు. మను యూనివర్సిటీ తరపున అడ్వాన్స్ కోర్సులను ప్రవేశపెడితే బాగుంటుందని అన్నారు.

సబ్సిడీతో టమాటాలు పంపిణీ

పులివెందుల : ప్రస్తుతం మార్కెట్‌లో కిలో టమాటాలు రూ.140 నుంచి రూ.150 లకు విక్రయిస్తున్నారని.. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో టమాటాలు పంపిణీ చేస్తోందని మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం రాత్రికి రెండు టన్నుల టమాటాలను తెప్పిస్తున్నామని.. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రజలకు సబ్సిడీతో కేజీ టమోటాలు రూ.50తో అందిస్తున్నామన్నారు. టమాటాల పంపిణీ కార్యక్రమాన్ని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగపు కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డిలు ప్రారంభిస్తారన్నారు. ప్రజలందరూ తమ ఆధార్ కార్డు వెంట తెచ్చుకుని రూ.50లకు కేజీ టమాటాలు పొందాలన్నారు.

ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు



జగనన్న సురక్ష ద్వారా సర్టిఫికెట్లను అందిస్తున్న నాయకులు

తొండూరు : మండల పరిధిలోని ఇనగలూరు గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం ఎంపీటీసీ దశరథరామిరెడ్డి, సర్పంచ్‌లు గంగయ్య, రామసుబ్బారెడ్డిల అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ సన్నన్న పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 98 శాతం ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందాయని.. మిగిలిన 2 శాతం ప్రజలకు అందలేదని సమాచారం తెలియడంతో వెంటనే 2 శాతం మందికి సంక్షేమ పథకాలు అందేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నిర్మించిన ఇందిరమ్మ కాలనీలో దెబ్బతిన్న ఇళ్లతోపాటు మరో 45 ఇళ్లు వాటి స్థానంలో నిర్మించేందుకు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి మంజూరు చేసినట్లు జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజలకు వివిధ రకాల సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలనరసింహులు, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రజినికాంత్‌రెడ్డి, బాలఎరికల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఇళ్లు మంజూరు చేశారు



నా పేరు ఓబుళమ్మ.. మాది తొండూరు మండలం ఇనగలూరు గ్రామం. నాకు 2004లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇందిరమ్మ కాలనీలో ఇళ్లు మంజూరు చేశారు. ఆ ఇళ్లు పాక్షికంగా దెబ్బతినడంతో నేను నాయకుల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నాకు కొత్త ఇళ్లు మంజూరైందని జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు తెలిపారు. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, స్థానిక నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

\- ఓబుళమ్మ, ఇనగలూరు, తొండూరు మండలం

చాలా ఇబ్బందులు పడ్డాం..



నా పేరు రంగ నాయకులు.. నాది తొండూరు మండలం ఇనగలూరు గ్రామం. నాకు 2004లో ఇందిరమ్మ కాలనీలో నాకు ఇళ్లు మంజూరైంది. ఆ ఇళ్లు పూర్తిగా వర్షానికి దెబ్బతినడంతో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఈ విషయాన్ని నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో నాకు కొత్త ఇళ్లు మంజూరు చేశారు. దీంతో వారికి ఎల్లప్పుడు రుణపడి ఉంటాం.

\- రంగనాయకులు, ఇనగలూరు, తొండూరు మండలం

జాతీయ మహాసభను విజయవంతం చేయండి

కమలాపురం : ఈనెల 7వ తేదీన వరంగల్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగే జాతీయ మహాసభను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం కమలాపురంలో జాతీయ మహాసభ కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. వికలాంగుల హక్కుల సాధనకై జరుగుతున్న జాతీయ మహాసభకు జిల్లాలోని ప్రతి మండలం నుంచి వికలాంగులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వికలాంగుల పింఛన్ రూ.3వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాతయ్య, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుబ్బరాయుడు, నగర అధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాచెయ్య, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం

పులివెందుల : పట్టణంలోని నగరిగుట్టలో ఉన్న నిరాశ్రయుల వసతి గృహంలో మంగళవారం అర్బన్ సీఐ రాజు మామ ఇ.మూర్తి జయంతిని పురస్కరించుకుని ఆయన సతీమణి నిరాశ్రయులకు భోజనం వడ్డించడంతోపాటు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. వసతి గృహంలో ఫ్యాన్లులేక దోమలతో ఇబ్బందులు పడుతున్నామని నిరాశ్రయులు అర్బన్ సీఐ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే కొత్త ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే పరిష్కరించి మీకు అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ స్వామి, హెడ్ కానిస్టేబుల్ సహదేవరెడ్డి, వసతి గృహ ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు.



నిరాశ్రయులకు భోజనం వడ్డిస్తున్న అర్బన్ సీఐ రాజు, భువన దంపతులు

లింకు రోడ్లకు మహర్దశ

సింహాద్రిపురం : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మండల వ్యాప్తంగా పలు గ్రామాలకు ప్రధాన రహదారిని కలుపుతూ రూ.15 కోట్లతో 30 కి.మీ. మేర లింకు రోడ్లు తారు రోడ్లుగా మారాయి. సింహాద్రిపురం–పులివెందుల ప్రధాన రహదారి నుంచి హిమకుంట్లకు వెళ్లే లింకు రోడ్డుకు రూ.2 కోట్లు, అలాగే హిమకుంట్ల–అంకాలమ్మగూడూరు మీదుగా కసనూరు, సుంకేసుల లింకు రోడ్డుకు రూ.6.50 కోట్లు, దిద్దేకుంట్ల నుంచి రావులకొలను లింకు రోడ్డుకు రూ.1.90 కోట్లు, ముసల్‌రెడ్డిపల్లె నుంచి సుంకేసులకు రూ.2 కోట్లు, సుంకేసుల నుంచి అహోబిలం లింకు రోడ్డుకు రూ.2 కోట్లు, ముసల్‌రెడ్డిపల్లె నుంచి చవ్వారిపల్లెకు రూ.39 లక్షలు, మొగమూరు వంక నుంచి కసనూరు, అగ్రహారం లింకు రోడ్డుకు రూ.25 లక్షలు, 70 శాతం పాడా నిధులతో లింకు రోడ్లన్నీ తారు రోడ్డుగా మారడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తారు రోడ్డుగా మారిన హిమకుంట్ల లింకు రోడ్డు

నగిరిగుట్టలో కుష్టువ్యాధి రికార్డుల పరిశీలన

పులివెందుల రూరల్ : స్థానిక నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని నగరిగుట్టలో మంగళవారం ఆశా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ పారా మెడికలాఫీసర్ సుబ్బారెడ్డి హాజరై కుష్టు వ్యాధికి సంబంధించి గత నెల 26 నుంచి జరిగిన సర్వే రిపోర్ట్ రికార్డులను పరిశీలించారు. అనంతరం తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ లిఖిత, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ పారా మెడికలాఫీసర్ సుబ్బారెడ్డి

దోమల నియంత్రణ మనందరి బాధ్యత

తొండూరు : దోమల నియంత్రణ మనందరి బాధ్యత అని తొండూరు పీహెచ్‌సీ డాక్టర్ రేష్మా తెలిపారు. పీహెచ్‌సీలో ఆశా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం డెంగీ నివారణ మాసోత్సవాలలో భాగంగా డెంగీ వ్యాధి నివారణకు అవగాహన ర్యాలీ నిర్వహించి వసతి గృహాలలో దోమల నివారణకు డీడీటీ పిచికారి చేశారు. దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, సీహెచ్‌ఓ రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, డీపీఎంఓ రమణారెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



హాస్టల్‌లో డీడీటీ పిచికారి చేయిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య